బతుకమ్మ వేడుకలకు రండి

అంబర్‌పేట: డీడీ కాలనీలో 30న నిర్వహించనున్న బతుకమ్మ వేడుకలకు హాజరు కావాలని కోరుతూ ఆ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు పార్టీ నగర కార్యాలయంలో కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డిని శనివారం కలిసి ఆహ్వాన పత్రాన్ని అందించారు. అలాగే బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతంరావు, కార్యదర్శి ఓ.శ్రీనివాస్‌రెడ్డిని సైతం ఆహ్వానించినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు గోవర్ధన్‌రెడ్డి, రామిరెడ్డి, దండు భాస్కర్‌రావు తదితరులు ఉన్నారు.

బతుకమ్మ ఏర్పాట్ల పరిశీలన

అంబర్‌పేట: మున్సిపల్ గ్రౌండ్‌లో ఈనెల 29 కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించనున్న బతుకమ్మ వేడుకల ఏర్పాట్లను రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎన్.గౌతంరావు స్థానిక నేతలతో కలిసి శనివారం పరిశీలించారు. నాయకులు రమేశ్‌యాదవ్, అజయ్‌కుమార్, ఎక్కాల నందు, నాగభూషణంచారి, రవీందర్ గౌడ్, నరేశ్‌గౌడ్, యశ్వంత్, నవీన్‌రెడ్డి, యాదగిరి, వెంకటేశ్‌గౌడ్, కృష్ణముదిరాజ్ పాల్గొన్నారు.

గ్రామీణ ప్రాంతాలకూ హోమియో వైద్య సేవలు



చిక్కడపల్లి: గ్రామీణ ప్రాంతాలకూ హోమియో వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావడమే ధ్యేయమని తెలంగాణ హోమియోపతి డాక్టర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు దండేపు బస్వానందం అన్నారు. చిక్కడపల్లిలోని హోమియోపతి క్లినిక్‌లో శనివారం ఆయన మాట్లాడుతూ.. హోమియోపతి వైద్యంలో కారు చౌకగా ఆపరేషన్లు లేకుండానే చికిత్స చేయవచ్చన్నారు. హోమియోపతి వైద్యంతో రోగాలు ఆలస్యంగా నయమవుతాయనే అపోహలు ఉన్నాయని, కానీ అది అవాస్తవం అని పేర్కొన్నారు. దీర్ఘకాలిక రోగాలకు సైతం హోమియోపతిలో చికిత్స అందుబాటులో ఉందన్నారు. ప్రతి మండల కేంద్రంలో డిస్పెన్సరీలను ఏర్పాటు చేసి ఈ వైద్యాన్ని ప్రజలకు అందుబాటులోకి తీసుకెళ్లేందుకు ప్రభుత్వం సహకారం అందించాలని ఆయన కోరారు.

బీసీ నేతల సంబురాలు

కాచిగూడ: కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ జీఓ జారీ చేయడంపై తెలంగాణ బీసీ జాగృతి వ్యవస్థాపక అధ్యక్షుడు, కాంగ్రెస్ సీనియర్ నేత కేపీ మురళీ కృష్ణ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నేతలు, కార్యకర్తలతో కలిసి శనివారం బర్కత్‌పురలో స్వీట్లు పంపిణీ చేసి సంబురాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో సీహెచ్ మురళీకృష్ణ, ధన్‌రాజ్ యాదవ్, లాలయ్య గౌడ్, లింగం, నందు ముదిరాజ్, రాజేశ్ లాల్, కదారి కుమార్ నాయక్, చంద్రయ్య పాల్గొన్నారు.

'కాంగ్రెస్‌ది కపట ప్రేమ'

ముషీరాబాద్: బీసీ రిజర్వేషన్లపై కాంగ్రెస్‌ది కపట ప్రేమ అని బీఆర్‌ఎస్ సీనియర్ రాష్ట్ర నాయకుడు నగేశ్‌ముదిరాజ్ విమర్శించారు. శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. బీసీ రిజర్వేషన్లపై రెడ్డి జాగృతి హైకోర్టులో లంచ్ మోషన్ పిటిషన్ వేయడం తగదన్నారు. రెడ్డి జాగృతి కాంగ్రెస్‌కు సంబంధించిన ఆర్గనైజేషన్ అని ఆరోపించారు. కాంగ్రెస్ బీసీలను పావుగా వాడుకుంటుందని బీసీలు అప్రమత్తంగా ఉండాలని ఆయన కోరారు.

రైల్లో బంగారు ఆభరణాల బ్యాగు చోరీ

కాచిగూడ: రైల్లో ప్రయాణిస్తున్న ఓ ప్రయాణికురాలి బంగారు ఆభరణాల బ్యాగు చోరీకి గురైంది. కాచిగూడ రైల్వే ఇన్‌స్పెక్టర్ ఆర్.ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం.. గుంటూరులోని అగ్రహారానికి చెందిన యశ్వంత్ కుమార్ జైన్ (32) కుటుంబ సభ్యులతో కలిసి కాచిగూడకు వచ్చేందుకు ఉజ్జయినిలో రైలు ఎక్కారు. పూర్ణ జంక్షన్ వద్దకు రాగానే బ్యాగు చూసేసరికి లేదు. అందులో 34 గ్రాముల బంగారు ఆభరణాలు ఉన్నాయి. కాచిగూడ రైల్వే పోలీసులు జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసి తదుపరి విచారణ కోసం నాందేడ్ రైల్వే పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేశారు.

ట్యాబ్ బ్యాగు ..

◆ రైల్లో ప్రయాణిస్తున్న నూకల సుబ్రహ్మణ్య ప్రసాద్ బ్యాగు చోరీ జరిగింది. రైల్వే ఇన్‌స్పెక్టర్ ఆర్.ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం.. సుబ్రహ్మణ్య ప్రసాద్ బెంగుళూర్ వెళ్లేందుకు కాచిగూడ రైలు ఎక్కాడు. రైల్లో సీటుపై బ్యాగు పెట్టి వాటర్ బాటిల్ కొనుగోలు చేసేందుకు కిందకు దిగాడు. రైలు ఎక్కి చూసే సరికి సీట్లో తన బ్యాగు కనిపించలేదు. బ్యాగులో ట్యాబ్, ఐడీ కార్డులు ఉన్నాయి. ప్రసాద్ సోదరుడు ప్రతాప్ కుమార్ కాచిగూడ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

కళల అభ్యున్నతికి కృషి

చిక్కడపల్లి: సీఎం రేవంత్‌రెడ్డి సాంస్కృతిక కళల అభ్యున్నతికి కృషి చేస్తున్నారని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, అంతర్జాతీయ ఆర్యవైశ్య ఫెడరేషన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ ఉప్పల శ్రీనివాస్ గుప్తా అన్నారు. దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శిఖరం ఆర్ట్ థియేటర్స్ ఆధ్వర్యంలో త్యాగరాయ గాన సభలో విజయ స్వర్ణనంది పురస్కారాల ప్రదానోత్సవం శనివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన ముఖ్య అతిథిగా హాజరై పురస్కారాలు ప్రదానం చేసి సన్మానించిన సాహిదుర్గ సంగీత నాట్యోత్సవం ప్రేక్షకరంజకంగా సాగింది. ట్రాఫిక్ అడిషనల్ డీసీపీ రాందాస్‌తేజావత్, లంకా లక్ష్మీనారాయణ, అంజనీ కుమారి, శ్రీరెడ్డి, వంశీ, దైవజ్ఞశర్మ, వరలక్ష్మి, రమేశ్, అనిత, సాయిపావని, జి.కృష్ణ, రాధిక తదితరులు పాల్గొన్నారు.

అర్ధరాత్రి ఆగమాగం..!

ఒక్కసారిగా పెరిగిన మూసీ వరద ఉధృతి

- పరీవాహక ప్రాంతాల్లోని ఇళ్లలోకి భారీగా నీరు
- చిక్కుకున్న వారిని పడవల్లో తరలించిన అధికారులు
- పునరావాస కేంద్రాల్లో బాధితులకు బస ఏర్పాట్లు
- సహాయక చర్యలు పర్యవేక్షించిన ఎమ్మెల్యే, అధికారులు



గోల్నాక పునరావాస కేంద్రంలో ఆహారం అందిస్తున్న ఎమ్మెల్యే కాలేరు



న్యూ అంబేద్కర్‌నగర్‌లో వరదలో చిక్కుకున్న వారిని బోటు సహాయంతో ఒడ్డుకు తరలిస్తున్న అధికారులు

అంబర్‌పేట: మూసీ ఉగ్ర రూపం దాల్చింది. శుక్రవారం అర్ధరాత్రి ఒక్కసారిగా వరద ప్రవాహం పెరిగి పరీవాహక ప్రాంతాల్లోని ఇళ్లలోకి భారీగా నీరు చేరడంతో ప్రజలు తీవ్ర భయందోళనకు గురయ్యారు. కొందరు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని అక్కడే ఉండగా మరికొందరూ సమీప బంధువుల ఇంటికి వెళ్లారు. మిగితావారికి అప్పటికప్పుడు అధికారులు ఏర్పాట్లు చేసిన పునరావాస కేంద్రానికి తరలించారు. అంబర్‌పేట మూసీ పరీవాహక ప్రాంతాలైన న్యూ అంబేద్కర్‌నగర్, కృష్ణానగర్, సంజయ్ గాంధీనగర్‌లో తీవ్ర ఇబ్బందులు తలెత్తాయి. ముసారాంబాగ్ పాత బ్రిడ్జిపై నుంచి భారీగా వరద ప్రవహిస్తోంది. న్యూ అంబేద్కర్‌నగర్‌లో సుమారు 30 నుంచి 40 నివాసాలను వరద ముంచెత్తింది. వీటిలో నివాసం ఉంటున్న సుమారు 200 మందికి పైగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. శనివారం అధికారులు న్యూ అంబేద్కర్‌నగర్‌లో చిక్కుకున్న ప్రజలను పడవల సహాయంతో బయటకు తీసుకువచ్చారు. ప్రధానంగా వృద్ధులు, చిన్నారులను నీటిలో నుంచి ఒడ్డుకు చేర్చి వారికి సమీప కమ్యూనిటీ హాల్‌లో పునరావాసం ఏర్పాటు చేసి ఆహారాన్ని అందించారు.

అప్రమత్తంగా..

శుక్రవారం సాయంత్రం నుంచే అధికారులు వరద ప్రభావిత ప్రాంతాలను సందర్శించి ప్రజలను అప్రమత్తం చేశారు. ఇళ్ల నుంచి రావాలని హెచ్చరికలు జారీ చేశారు. కొంతమంది బయటకు వచ్చినా మరి కొందరు రాకపోవడంతో వారిని శనివారం పడవల సహాయంతో బయటకు తీసుకువచ్చారు. ప్రభావిత ప్రాంతాలను జీహెచ్‌ఎంసీ కమిషనర్ కర్ణన్, ఈస్ట్ జోన్ డీసీపీ బాలస్వామి, స్థానిక ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్, కార్పొరేటర్లు దూసరి లావణ్యశ్రీనివాస్‌గౌడ్, విజయ్‌కుమార్‌గౌడ్ సహాయక చర్యలను పర్యవేక్షించారు. మూసీ వరద ప్రవాహాన్ని గమనిస్తూ అంబర్‌పేట పోలీసులు, జీహెచ్‌ఎంసీ అధికారులు తగు చర్యలు చేపడుతున్నారు.

మా బిడ్డ ఇంటికి వెళ్లిన..



రాత్రి ఇంట్లోకి భారీగా వరద వచ్చింది. దీంతో భయపడి సమీపంలో మా బిడ్డ ఇంటికి పోయిన. పొద్దున్నే తిరిగి ఇంటికి వచ్చాను. వరద నీరు ఎప్పుడు తగ్గుతుందో అని భయం వేస్తుంది. ఎప్పుడూ ఇన్ని నీళ్లు రాలేదు.

– అంజమ్మ, న్యూ అంబేద్కర్‌నగర్



సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్న ఈస్ట్‌జోన్ డీసీపీ బాలస్వామి, ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్



న్యూ అంబేద్కర్‌నగర్‌లో ప్రభావిత ప్రాంతాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్



పునరావాస కేంద్రంలో ఏర్పాట్లు చేస్తున్న జీహెచ్‌ఎంసీ అధికారులు

పునరావాస కేంద్రాల్లో ఏర్పాట్ల పరిశీలన

అంబర్‌పేట: మూసీ వరద బాధితుల కోసం గోల్నాకలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని జీహెచ్‌ఎంసీ కమిషనర్ కర్ణన్ జోనల్ కమిషనర్ రవికిరణ్, డీఎంసీ మారుతీదివాకర్, ఏఎంహెచ్‌ఓ డాక్టర్ హేమలతలతో కలిసి శనివారం సందర్శించారు. బాధితులకు ఇబ్బందుల్లేకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని క్షేత్ర స్థాయి అధికారులను ఆదేశించారు. ఆహారం, వైద్యంతో పాటు పారిశుధ్యం వంటి సౌకర్యాలపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. ఎలాంటి ఆందోళన చెందవద్దని ప్రభుత్వం అండగా ఉంటుందని కమిషనర్ భరోసానిచ్చారు.



పునరావాస కేంద్రంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న జీహెచ్‌ఎంసీ కమిషనర్ కర్ణన్

కులాంతర వివాహాలను ప్రోత్సహిద్దాం

ముషీరాబాద్: కులాంతర వివాహాలను ప్రోత్సహిద్దామని మాస్‌లైన్ కార్యదర్శి ఎం.హన్మేశ్ పేర్కొన్నారు. జ్యోతిబా పూలే స్థాపించిన సత్యసోధక్ సమాజ్ ఆవిర్భవించి 152 ఏళ్లు అయిన సందర్భంగా సీపీఐఎంఎల్ మాస్‌లైన్ గ్రేటర్ హైదరాబాద్ కమిటీ ఆధ్వర్యంలో విద్యానగర్‌లోని మార్క్స్ భవన్‌లో శనివారం సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కె.జి.రాంచందర్, ఎస్.ఎల్.పద్మతో కలిసి మాట్లాడుతూ.. నవతరం, యువతరం కుల నిర్మూళనకు పోరాడాలని పిలుపునిచ్చారు. కులాంతర విహహాలు చేసుకున్న శ్రావణ్‌కల్యాణి, ఎం.రాజ్యలక్ష్మిఅర్జున్, కంచర్ల భద్రిఅంజలి, ఎస్.ఎల్.పద్మసతీశ్, రవిదేవమణి, ప్రదీప్‌విజయ, స్వరూపాలక్ష్మీనారాయణను సభ అభినందించింది. కార్యక్రమంలో ప్రవీణ్, వరలక్ష్మి, లక్ష్మి, కృష్ణ, భీమేశ్ తదితరులు పాల్గొన్నారు.

మెగా వైద్య శిబిరానికి స్పందన

కవాడిగూడ: 'స్వస్తిక్ నారీ స్వశక్తి పరివార్ అభియాన్' లో భాగంగా గగన్‌మహల్ హెల్త్ సెంటర్ వైద్యాధికారి రాజ్యలక్ష్మి ఆధ్వర్యంలో దోమలగూడలోని గగన్‌మహల్ భారత్ స్కౌట్ అండ్ గైడ్స్ పాఠశాలలో శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురిని పరీక్షించి మందులు అందజేశారు. అనంతరం కవాడిగూడ కార్పొరేటర్ జి. రచన శ్రీ మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న మెగా హెల్త్ క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆసుపత్రి సిబ్బంది మంగ బీజేపీ రాష్ట్ర నాయకుడు జి.వెంకటేశ్, వైద్యులు పాల్గొన్నారు.

బతుకమ్మ.. బతుకమ్మ.. ఉయ్యాలో..



బతుకమ్మ ఆడుతున్న నగర జేసీఎల్ సునీత, డీసీఎల్‌లు తదితరులు

చిక్కడపల్లి: ఆర్టీసీ క్రాస్‌రోడ్డులోని లేబర్ కమిషనర్ కార్యాలయంలో శనివారం సాయంత్రం బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యాలయ ఎల్‌ఓలు, ఉద్యోగులు, సిబ్బంది తీరొక్క పూలతో బతుకమ్మలు పేర్చి వేదిక పెట్టి ఆడిపాడారు. కార్యక్రమంలో నగర కార్మికశాఖ జేసీఎల్ సునీత, డీసీఎల్‌లు శ్యాంసుందర్‌జాజు, శ్రీనివాస్‌గౌడ్, సూపరింటెండెంట్ యమునాబాయి, ఏఎల్‌ఓలు మయూరి, రజనీ, శశికరణ, శిరీష, విజయలక్ష్మి, రాధమ్మ, ప్రసన్న, నమ్మిత తదితరులు

కొండా లక్ష్మణ్ బాపూజీకి ఘన నివాళి

అంబర్‌పేట్, ముషీరాబాద్ నియోజకవర్గాల్లో స్వాతంత్ర్య సమరయోధుడు, తెలంగాణ పోరాట యోధుడు కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలను శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు, నాయకులు ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

– అంబర్‌పేట్, ముషీరాబాద్ జోన్ బృందం



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రమణ, ఎమ్మెల్యే ముఠా గోపాల్



విద్యానగర్‌లోని బీసీ భవన్‌లో నివాళులర్పిస్తున్న ఎంపీ ఆర్.కృష్ణయ్య



ఆర్టీసీ క్రాస్ రోడ్‌లో నివాళులర్పిస్తున్న అతినగరం సుదేశ్‌కుమార్ తదితరులు



మాట్లాడుతున్న హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ

ఉప ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలి



మాట్లాడుతున్న కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి

కాచిగూడ: జూబ్లీ హీల్స్ ఉప ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు పని చేయాలని కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి పిలుపునిచ్చారు. హైదరాబాద్ సెంట్రల్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు లంకల దీపక్‌రెడ్డి అధ్యక్షతన బర్కత్‌పురలోని పార్టీ నగర కార్యాలయంలో పదాధికారుల సమావేశం శనివారం జరిగింది. ఆయన ముఖ్య అతిథిగా హాజరై దిశానిర్దేశం చేశారు. ప్రధాని నరేంద్రమోదీ జీవిత చరిత్రపైన ఈనెల 30న హైటెక్స్‌లో మనోజ్ ముంతాసిర్ శుక్లా ఆధ్వర్యంలో నిర్వహించనున్న సాంస్కృతిక ప్రదర్శనలో అందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎన్.గౌతంరావు, నేతలు ఏడెల్లి అజయ్‌కుమార్, గడ్డం వెంకటస్వామి, ప్రేమ్ కుమార్, కన్నె రమేశ్ యాదవ్, శ్యామ్‌రాజ్, గంగరాజు, ప్రసాద్, రాహుల్ చంద్ర, వీణారెడ్డి, ఎక్కాల కన్నా, మూల రవీందర్ గౌడ్, పవన్ కుమార్, సుప్రీయా గౌడ్, నర్సింగ్ ముదిరాజ్, ఎ.సూర్యప్రకాశ్ సింగ్, భుజందర్ పాల్గొన్నారు.

నీరా కేఫ్‌కు ప్రాధాన్యత ఇవ్వాలి

కల్లుగీత కార్మిక సంఘం అధ్యక్షుడు వెంకటరమణ



సుందరయ్య విజ్ఞాన కేంద్రం: టూరిజం పాలసీలో నీరా కేఫ్‌లకు ప్రాధాన్యత ఇవ్వాలని తెలంగాణ కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మేకపోతుల వెంకటరమణ ప్రభుత్వాన్ని కోరారు. కల్లుగీత సంఘం కార్యాలయంలో శనివారం ఆయన మాట్లాడుతూ.. ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకుని శిల్పారామం వేదికగా తెలంగాణ టూరిజం కాన్‌క్లేవ్ 2025లో నూతన ప్రాజెక్టుకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుడుతోందన్నారు. ఇందులో భాగంగా హోటళ్లు, వెల్‌నెస్ సెంటర్లు, ద్రాక్ష పంటల నుంచి వైన్ తయారీ, హాస్పిటాల్టీ ప్రాజెక్టుల ఏర్పాటుకు నిర్ణయం తీసుకోబోతున్నారని, వీటిలో ప్రకృతి పానీయం నీరాను పర్యాటకులకు అందించేందుకు నీరా కేఫ్‌లను ఏర్పాటు చేస్తే గౌడ యువతకు ఉపాధి కల్పించినట్లువుతుందన్నారు. కల్లు నుంచి వైన్ తయారు చేసే ఆధునిక టెక్నాలజీ వచ్చిందని రాష్ట్రంలో కోటి తాటి, ఈత చెట్లు ఉన్నాయని పాల సేకరణ చేసినట్లుగా కల్లును సేకరించి వైన్ తయారీలో ఉపయోగిస్తే గీతా కార్మికులకు ఉపాధి పెరుగుతుందని విన్నవించారు.

ఫీవర్ ఆసుపత్రికి వాటర్ ప్యూరిఫయర్స్ విరాళం



నల్లకుంట: దివీస్ ల్యాబొరేటరీస్ లిమిటెడ్ రూ. 47,44,750 వ్యయంతో 9 వాటర్ ప్యూరిఫయర్స్‌ను నల్లకుంట ఫీవర్ ఆసుపత్రికి విరాళంగా అందజేసింది. వాటి ఏర్పాటుపూర్తి కావడంతో ఉస్మానియా మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాజారావు, ఫీవర్ ఆసుపత్రి ఇన్‌చార్జి సూపరింటెండెంట్ ఎస్. రాజేంద్ర ప్రసాద్, సీఎస్ ఆర్‌ఎంవో డాక్టర్ జయలక్ష్మి, డిప్యూటీ ఆర్‌ఎంవో డాక్టర్ జయశ్యామ్‌సుందర్, దివీస్ ల్యాబోరేటరీ ప్రతినిధులు శ్రీనివాస్‌తో కలిసి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కొత్తగా నిర్మాణం జరుగుతున్న ఎమర్జెన్సీ బ్లాక్ పనులు పూర్తి కాగానే గంటకు 500 లీటర్ల నీటిని ఫిల్టర్ చేసే మరో ప్యూరిఫయర్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైద్యులు, నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

'అసైన్డ్ భూములకు హక్కులు కల్పించాలి '



సమావేశంలో జస్టిస్ చంద్రకుమార్, సుదర్శన్ బాబు తదితరులు

కవాడిగూడ: అసైన్డ్ భూములకు పట్టా భూములతో సమానంగా హక్కులు కల్పించాలని పలువురు వక్తలు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కవాడిగూడ లోయర్ ట్యాంక్‌బండ్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ భవన్‌లో తెలంగాణ అసైన్డ్ ల్యాండ్ ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు, మేధావులు, విద్యావేత్తలు, ప్రొఫెసర్లు వివిధ ప్రజా సంఘాలతో కలిసి శనివారం ప్రజా సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా జస్టిస్ చంద్రకుమార్, అసైన్డ్ భూముల పరిరక్షణ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎర్రోళ్ల శివయ్య, షెడ్యూల్డ్ కులాల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు డి.సుదర్శన్ బాబు,ప్రొఫెసర్లు తిరుపతి, అన్వర్భన్లు హాజరై మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ ఇచ్చిన హామీ మేరకు అసైన్డ్ భూములకు సంపూర్ణ హక్కులు కల్పించాలన్నారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం రైతు వేదికలు, వైకుంఠ ధామాలకు ఇతర ప్రభుత్వ కార్యక్రమాలకు బలవంతంగా లాక్కొన్న అసైన్డ్ భూమలకు నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. అసైన్డ్ భూ అక్రమణలపై రాష్ట్ర ప్రభుత్వం తగిన నిర్ణయాలు తీసుకోకుంటే జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో ఆసైన్డ్ భూముల యజమానుల తరఫున పోటీ చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు గారాల నాగేశ్వరరావు, మహేందర్, కృష్ణవేణి స్టాలిన్, దాసరి యాదగిరి, శంకర్,సాల్మాన్‌రాజు భిక్షపతి పాల్గొన్నారు.

ట్రైనీ ఐపీఎస్‌లకు అవగాహన



ట్రైనీ ఐపీఎస్‌లకు కేసుల వివరాలు వెల్లడిస్తున్న చిక్కడపల్లి ఇన్‌స్పెక్టర్ రాజునాయక్

చిక్కడపల్లి: సర్దార్ వల్లాభాయ్ పటేల్ నేషనల్ పోలీస్ అకాడమీ (ఎస్‌వీపీఎన్‌పీ)కు చెందిన ట్రైనీ ఐపీఎస్‌లు చిక్కడపల్లి పోలీస్‌స్టేషన్‌ను శనివారం సాయంత్రం సందర్శించారు. ఈ సందర్భంగా క్రైం రిపోర్ట్, ఎఫ్ఐఆర్, కోర్టు పిటిషన్ వివిధ కేసుల వివరాలను చిక్కడపల్లి పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ బి.రాజునాయక్ వారికి వివరించారు. ట్రైనీ ఐపీఎస్‌లు జాహ్నవిశేఖర్ (మహారాష్ట్ర),దీక్షబోరెల్ (హర్యానా), మానవ్ (ఢిల్లీ), అబూకర్ (మాల్దీవ్స్ పోలీస్)లు ఉన్నారు. అలాగే పీఎస్ పరిధిలోని వివిధ ప్రాంతాలను కూడా పోలీసులతో కలిసి సందర్శించారు.

నర్సింహబస్తీలో కూలిన రైల్వే ట్రాక్ ప్రహరీ

- పలు వాహనాలు ధ్వంసం
- నష్టపరిహారం చెల్లించాలి
- శిథిలాల తొలగింపు అడ్డుకున్న బస్తీవాసులు
- కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి చొరవతో శాంతించిన బస్తీవాసులు



నలిగిన వాహనాలను పరిశీలిస్తున్న కేంద్రమంత్రి కిషన్ రెడ్డి

నల్లకుంట: నర్సింహబస్తీ నుంచి టీఆర్టీ షెటిల్ గ్రౌండ్‌కు వెళ్లే దారిలోని రైల్వే ట్రాక్ ప్రహరీ శనివారం తెల్లవారుజామున అకస్మాత్తుగా కూలిపోయింది. ఈ ఘటనలో ప్రహరీ పక్కనే నిలిపిన 2 కార్లు, 2 ఆటోలు, 5 ద్విచక్ర వాహనాలు పూర్తిగా ధ్వంసమయ్యాయి. ఉదయం బస్తీవాసులు గమనించి రైల్వే అధికారులు, స్థానిక ఎమ్మెల్యే కాలేరు వెంకటేష, కార్పొరేటర్ అమృతకు ఫోన్ ద్వారా సమాచారం అందించారు. వెంటనే అక్కడికి చేరుకున్న ఎమ్మెల్యే కాలేరు, బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎన్. గౌతం రావు, కార్పొరేటర్ అమృత పరిశీలించారు.

రైల్వే అధికారుల నిర్లక్ష్యమే కారణం: బస్తీవాసులు

◆ రైల్వే ట్రాక్‌ను ఆనుకుని ఏపుగా పెరిగిన చెట్ల కొమ్మల తొలగింపు పనులు రైల్వే అధికారులు కొన్నిరోజుల క్రితం చేపట్టారు. ఆ సమయంలో అధికారులు కనీస జాగ్రత్తలు తీసుకోలేదని, ఈ కారణంగానే ప్రహరీ కూలిందని ఆరోపించారు.

శిథిలాల తొలగింపు అడ్డగింత..

◆ రైల్వే అధికారులు కూలిన ప్రహరీ శిథిలాలు తొలగించేందుకు యత్నించగా బస్తీ అధ్యక్ష, కార్యదర్శులు, ఎం.భూపతినాథ్, శ్రీనివాసు బస్తీవాసులుతో కలిసి అడ్డుకున్నారు. సికింద్రాబాద్ ఎంపీ, కేంద్రమంత్రి కిషన్ రెడ్డి వచ్చి పరిశీలించి రైల్వే శాఖ నుంచి నష్ట పరిహారం ఇప్పిస్తామని హామీనిస్తేనే శిథిలాల తొలగింపునకు సహకరిస్తామని పేర్కొన్నారు. వెంటనే కార్పొరేటర్ కేంద్రమంత్రికి సమాచారం ఇవ్వగా ఆయన ఘటనా స్థలానికి చేరుకుని కూలిన రైల్వే ట్రాక్ ప్రహరీని పరిశీలించారు. బాధితులకు నష్టపరిహారం అందేలా రైల్వే అధికారులతో మాట్లాడుతానని చెప్పడంతో బస్తీవాసులు శిథిలాల తొలగింపునకు సహకరించారు.

15 మీటర్ల ప్రహరీ నిర్మించాలి: కేంద్రమంత్రి

◆ కూలిన ప్రహరీతో పాటు ఆ పక్కనే ఉన్న మరో ప్రహరీ కూడా ఒరిగిపోయిందని వెంటనే 15 మీటర్ల మేర పటిష్ఠ ప్రహరీ నిర్మించాలని రైల్వే అధికారులకు సూచించారు. నిర్మాణ సమయంలో వాహనాల రాకపోకలు లేకుండా చూసుకోవాలని రైల్వే అధికారులు, బస్తీవాసులకు సూచించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా నల్లకుంట ఎస్‌హెచ్‌వో మారుతీ ప్రసాద్ బందోబస్తు ఏర్పాటు చేశారు. రైల్వే అధికారులు శ్రీనివాస్, ప్రసాద్, వెంకటేశ్, రైల్వే పోలీసులు, స్థానిక బీజేపీ నాయకులు ఉన్నారు.



శిథిలాల కింద నలిగిపోయిన వాహనాలు